సాక్షి మహబూబాబాద్

శనివారం | 16 | ఆగస్టు | 2025



సాంకేతికాభివృద్ధిలో కొత్త ఒరవడి

టీజీ ఎన్పీడీసీఎల్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డి సాంకేతికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు.

- 8లో



సంఘాలను పటిష్టం చేయాలి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
30.9^0 / 22.7^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భర్త అడుగుజాడలో..

- జాతీయ జెండా ఎగురవేసిన భార్య



గూడూరు: భర్త ప్రారంభించిన జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని ఆయన మరణానంతరం భార్య కొనసాగించింది. మండలంలోని సీతానగరంలో కాంగ్రెస్ నాయకుడు ధీకొండ కృష్ణమూర్తి ఏటా స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసేవారు. ఇందుకోసం తన ఇంటి ఎదుటనే గద్దెను నిర్మించాడు. అయితే గత ఏడాది తన 70వ ఏటా అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 30 సంవత్సరాలుగా కృష్ణమూర్తి నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆయన భార్య రాధమ్మ కొనసాగించింది. శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాధమ్మ తన సొంత ఖర్చుతో జాతీయ పతాకాన్ని ఎగురవేసి నేటి యువతకు ఆదర్శంగా నిలిచింది.

ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందడి

- రుద్రేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు



హన్మకొండ కల్చరల్ : చారిత్రక వేయిస్తంభాల గుడిలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా రుద్రేశ్వరస్వామి వారిని విభూది, గంధంతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, మహా హారతి నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రభాతసేవ, గణపతికి అభిషేకం, రుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు.

భద్రకాళి దేవాలయంలో..

భద్రకాళి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శ్రావణమాస పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో సందర్శించారు. మేయర్ గుండు సుధారాణి ఒడిబియ్యం, చీర సమర్పించారు. న్యూఢిల్లీకి చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోస్ట్ జితేంద్రగుప్తా, సీపీఎంజీ తెలంగాణ పీవీఎస్ రెడ్డి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. వారితో పాటు వరంగల్ ఎస్పీ రవికుమార్, హనుమకొండ ఎస్పీ హనుమంతు, సీతారాం, వెంకన్న ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ రామల సునీత ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా వరంగల్‌లోని సద్గురు శివానందమూర్తి గురుసప్తధామంలో సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం రాజరాజేశ్వరి దేవి అమ్మవారిని, శ్రీచక్రాన్ని పూలమాలతో అలంకరించారు. అమ్మవారి ఉపాసకులు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి శ్రీచక్రార్చన పూజలు నిర్వహించారు. హంటర్‌రోడ్‌లోని సంతోషిమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. నగరంలోని పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశోక్



మహబూబాబాద్ అర్బన్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మానుకోట పట్టణానికి చెందిన గద్దం అశోక్‌గౌడ్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

'నవోదయ' గడువు పెంపు

మామునూరు : వరంగల్ మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న చివరి తేదీ ఉండగా.. విద్యాలయ సమితి మరోమారు గడువు పెంచుతూ అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

విప్లవాత్మక మార్పులు

- విద్య, వైద్యం, వ్యవసాయరంగాలపై దృష్టి
- సంక్షేమం, అభివృద్ధి జోడెడ్లుగా ప్రయాణం
- త్యాగాల స్ఫూర్తితో పాలన
- పంద్రాగస్టు వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్

సాక్షి, మహబూబాబాద్/ మహబూబాబాద్:

ఒక వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయరంగాల్లో మార్పులు తెస్తున్నామని డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ జాటోత్ రామచంద్రునాయక్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. సైనిక వందనం స్వీకరించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు. స్వాతంత్య్ర సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. అనంతరం ఆయన జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

పేదల ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం..

భారత స్వాతంత్య్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల ఆకలి తీర్చేందుకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని రామచంద్రునాయక్ అన్నారు. జిల్లాలో 2,43,204 కుటుంబాలకు మూడు నెలల కోటా మొత్తం 14,414,034 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సరఫరా చేశామని తెలిపారు. చాలాకాలంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం గమనించి జిల్లాలో 31,052 కొత్తరేషన్ కార్డులు మంజూరు చేశామని, 41,095 కార్డుల్లో పేర్లు నమోదు చేసినట్లు చెప్పారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

జిల్లాలో నాలుగు విడతలుగా రూ. 570.54కోట్లు కేటాయించి 1,04,628 మంది రైతులకు రుణవిముక్తి కలిగించామన్నారు. రైతు బీమా పథకం ద్వారా జిల్లాలో మరణించిన 821 మంది కుటుంబాలకు రూ. 41.05కోట్లు అందజేశామని చెప్పారు. రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు ఆరు వేల రూపాయల చొప్పున వానాకాలం సీజన్‌లో 2,11,810 మంది రైతులకు రూ.268 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఉద్యానశాఖ ద్వారా రైతులకు ప్రోత్సాహకాలు అందించి బిందుసేద్యం, శాశ్వత పందిర్లు వేయడం కోసం నిధులు కేటాయించామని పేర్కొన్నారు. అదే విధంగా రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు సన్న ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ అదిస్తున్నామని, దీంతో గతం కన్నా ఎక్కువగా యాసంగి సీజనల్‌లో 1,77,355 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుసంవర్ధక శాఖ ద్వారా పశుపోషణకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని చెప్పారు. మత్స్యశాఖ ద్వారా నూతన చెరువుల నిర్మాణం, ఉచిత చేపపిల్లల పంపిణీ, ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు.



ప్రసంగిస్తున్న డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్

కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో జెండా ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ స్పీకర్

ప్రభుత్వ వైద్యంపై భరోసా..

ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు భరోసా కల్పించేలా వైద్య సేవలు అందిస్తున్నామని ఆయన అన్నారు. జిల్లాలోని 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 173 సబ్ సెంటర్లు, ఒక బస్తీ దవాఖాన, రెండు సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రి ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ ద్వారా 134 రకాల పరీక్షలు ఉచితంగా చేసి ప్రజలపై భారం తగ్గించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన ప్రసవాలే ఇందుకు నిదర్శనం అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం దారా 2024జూలై నుంచి ఇప్పటి వరకు 24,492 మందికి రూ. 65.32కోట్లు అందజేశామన్నారు.

ప్రభుత్వ బడిలో మెరుగైన విద్య

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యను అందిస్తూ ఆదర్శ రాష్ట్రంగా ముందుకు సాగుతున్నామని రామచంద్రు నాయక్ అన్నారు. జిల్లాలో 1,207 ప్రభుత్వ పాఠశాలల్లో 1,00,069 మంది విద్యార్థులు చదువుతున్నారని, వీరికి ఉచిత పుస్తకాలు, రెండు జతల దుస్తులు, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నామని, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించి కొరత లేకుండా చూశామని చెప్పారు. మరింత మెరుగైన బోధన అందించేందుకు ప్రతీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు ప్రక్రియ మొదలు పెట్టామని వివరించారు.

పేదల ముంగిట సంక్షేమ పథకాలు..

ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుందని రామచంద్రునాయక్ అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 1,16,319 కుటుంబాలకు ఎల్పీజీ గ్యాస్, క్రమం తప్పకుండా ప్రతీ నెల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, కులవృత్తుల కార్మికులకు ఆసరా పింఛన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తూ ఆర్థిక పరిపుష్టి సాధించేలా చూస్తున్నారు. బ్యాంకు లింకేజీ, వడ్డీలేని రుణాలు అందిస్తూ మహిళా సాధికారత కోసం పాటుపడుతున్నామని అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం, నూతన పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సమస్య లేకుండా చూస్తున్నామని చెప్పారు. గుడుంబా నివారణ, గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్, ఎక్సైజ్ శాఖల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మానుకోట ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, ఆర్డీఓ కృష్ణవేణి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలను సన్మానిస్తున్న డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్, ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

అలరించిన నృత్య ప్రదర్శనలు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు వందేమాతం పాటకు నృత్యం చేశారు. అలాగే ఎంజేపీ, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల విద్యార్థులు, కురవి కేజీబీవీ విద్యార్థినుల నృత్యాలు ఆహుతులను అలరించాయి.



డాన్స్ చేస్తున్న విద్యార్థులు

మహనీయుల ఆశయ సాధనకు పాటుపడాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఇతర అధికారులు

మహబూబాబాద్ రూరల్: దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల ఆశయ సాధనకు పాటుపడాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో ఎస్పీ జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టవ్యవస్థను కాపాడడం మనందరి బాధ్యత అని, ప్రతీ పోలీసు ఉద్యోగి ప్రజల భద్రత కోసం, న్యాయపాలన కోసం కట్టుబడి ఉండాలన్నారు. నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణలో ప్రతీ ఒక్కరు సమర్థవంతంగా పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానుకోట డీఎస్పీ తిరుపతిరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఏఓ, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, డీపీఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిని ప్రోత్సహించొద్దు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ



జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ, జడ్జీలు స్వాతి, కృష్ణతేజ్

మహబూబాబాద్ రూరల్ : ప్రతీ ఒక్కరు అవినీతి నిర్మూలనకు పాటుపడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా మనం నేడు స్వాతంత్య్ర వేడుకలను జరుపుకుంటున్నామని, న్యాయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. కోర్టుల్లో అవినీతి జరిగితే తన దృష్టికి తీసుకురావాలని కక్షిదారులు, న్యాయవాదులకు సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, జిల్లా కోర్టు ముఖ్య పరిపాలన అధికారి క్రాంతికుమార్, పోక్సో కోర్టు పీపీ కొంపెల్లి వెంకటయ్య, జిల్లా కోర్టు జీపీ తోర్నాల నగేష్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రేంచందర్, సిద్ధార్థ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఉత్తములకు ప్రశంస

- వివరాలు 8లో

మత్తడి.. సవ్వడి



మత్తడి పోస్తున్న బయ్యారం పెద్దచెరువు

- జిల్లాలో అలుగుపోస్తున్న 374 చెరువులు

మహబూబాబాద్: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పలు చెరువులు మత్తడి పోస్తున్నాయి. కాగా గతంలో దెబ్బతిన్న చెరువుల్లో కొన్నింటి మరమ్మతులు చేయకపోవడంతో నీరు దిగువకు వృథాగా పోతోంది. అలాగే వాగులు, వంకలు ఉరకలేస్తున్నాయి.

1,590 చెరువులు..

జిల్లాలో 18 మండలాల్లో 1,590 చెరువులు ఉన్నాయి. వాటిలో 25 శాతం వరకు నిండిన చెరువులు 13ఉండగా.. 25 నుంచి 50 శాతం నిండినవి 140 చెరువులు, 50 నుంచి 75శాతం నిండిన చెరువులు 281 ఉన్నాయి. 75నుంచి 100 శాతం నిండిన చెరువులు 782 ఉండగా.. 374 చెరువులు మత్తడి పోస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ముందుగా జిల్లాలోని చెరువులను పరిశీలించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో పాటు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, మంత్రులు కూడా భారీ వర్షాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారి ఆదేశాలను జిల్లాలో అమలు చేస్తున్నారు.

దెబ్బతిన్న 136 చెరువులు

గతంలో జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా 136 చెరువులు దెబ్బతిన్నాయి. కాగా వాటిలో 104 చెరువులు మరమ్మతులు చేసినట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. పలు కారణాల వల్ల 32 చెరువుల మరమ్మతులు పూర్తి కాలేదని తెలిపారు. దీంతో ఆయా గ్రామాలకు ముంపు పొంచి ఉంది.

నిండిన, మత్తడి పోస్తున్న చెరువులు

మండలం	75 నుంచి 100%	మత్తడి పోస్తున్నవి
మానుకోట	32	28
గూడూరు	02	120
చిన్నగూడూరు	04	-
దంతాలపల్లి	19	10
డోర్నకల్	11	-
మరిపెడ	15	6
నర్సింహులపేట	10	3
సీరోలు	24	7
కురవి	48	15
నెల్లికుదురు	8	5
కేసముద్రం	19	20
ఇనుగుర్తి	12	7
గార్ల	90	6
బయ్యారం	95	3
తొర్రూరు	8	27
పెద్దవంగర	4	4
కొత్తగూడ	278	37
గంగారం	103	76
మొత్తం	782	374

గ్రామాల బాట..

- కుటుంబాలను దత్తత తీసుకుంటున్న వైద్య విద్యార్థులు
- ఆరోగ్యంపై అవగాహన, వైద్య సహాయం అందించేలా కృషి
- ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న భావి వైద్యులు



గ్రామాల్లోకి వెళ్తున్న వైద్య విద్యార్థులు (ఫైల్)

నెహ్రూసెంటర్: జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు గ్రామాల బాట పడుతున్నారు. పల్లెల్లో ఇప్పటి నుంచే ప్రజల నాడి పడుతున్నారు. వైద్యకళాశాలలో చేరిన మొదటి సంవత్సరం నుంచే సమీప గ్రామాల్లోని మూడు కుటుంబాలను ఒక్కో ఎంబీబీఎస్ విద్యార్థి దత్తత తీసుకుంటున్నారు. చదువు పూర్తయ్యే వరకు ఆయా కుటుంబాల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటూ.. వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. వైద్యం అవసరం ఉంటే ప్రభుత్వ ఆస్పత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మూడు బ్యాచ్‌ల్లో 450 మంది ఉండగా, నాలుగో బ్యాచ్ కూడా రానుంది. కాగా పరిసర ప్రాంతాలైన అమనగల్, కంబాలపల్లి గ్రామాలను దత్తత తీసుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

కుటుంబాల దత్తత..

ఒక్కో వైద్య విద్యార్థి గ్రామంలోని మూడు కుటుంబాలను దత్తత తీసుకుని నాలుగేళ్ల పాటు వారికి అన్ని రకాల వ్యాధులపై అవగాహన కల్పిస్తూ వైద్య సూచనలు చేయాల్సి ఉంటుంది. కుటుంబాలను నిత్యం సందర్శిస్తూ రికార్డులను మెయింటెన్ చేయడం ద్వారా విద్యార్థులకు అదనపు మార్కులు కలిసే అవకాశాలు ఉన్నాయి.

ప్రత్యేక కార్యక్రమాల్లో...

ప్రజలకు ఉపయోగపడే ప్రతీ ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొంటున్నారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తూ వారి ఆరోగ్య సంరక్షణకు పాటుపడుతున్నారు. టీబీ, డెంగీ, మలేరియా, కరోనా, ఎంసీహెచ్, గర్భిణులు, సీజనల్ వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, తల్లిపాల వారోత్సవాలు, పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించేలా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులను పరీక్షించి అవగాహన కల్పిస్తున్నారు.

నిధుల కొరతతో సాగని కార్యక్రమాలు..

ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థుల కార్యక్రమాలకు నిధుల కొరత కారణంగా ముందుకు సాగడం లేదని, ఫ్యామిలీ దత్తతతో పాటు ఇతర ప్రత్యేక కార్యక్రమాలకు నిధుల కొరత వేధిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిధులు సమకూరిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలుపుతున్నారు.

ప్రజలతో ఎలా మమేకం కావాలో తెలుస్తుంది



గ్రామాల్లోని కుటుంబాల దత్తత వల్ల ప్రజలతో ఎలా మెలగాలి.. భవిష్యత్‌లో వైద్య వృత్తిని చేపట్టిన తర్వాత అందించాల్సిన వైద్యంపై అవగాహన పెరుగుతోంది. ప్రజల ఆరోగ్య పరిస్థితులను అర్థం చేసుకుని అవగాహన పెంచేలా కార్యక్రమం సాగుతుంది.

- ఎన్.రాంచందర్, వైద్య విద్యార్థి

అవగాహన కల్పిస్తున్నాం..



గ్రామాల్లో కుటుంబాలను దత్తత తీసుకుని వారికి వ్యాధులపై అవగాహన కల్పించడం, వైద్య సేవలు అందేలా చూస్తున్నాం. ప్రజలను చైతన్యం చేసేందుకు మంచి కార్యక్రమం. ప్రజల్లో వ్యాధుల నివారణపై అవగాహన పెంచుతున్నాం.

- దమయంతి, వైద్య విద్యార్థిని

మంచి వైద్యులుగా ఎదిగేలా..



వైద్యవృత్తి చేపట్టే ముందు వైద్య విద్యార్థులకు సమాజంపై అవగాహన, సామాజిక స్పృహ కల్పించడం కోసం వైద్య విద్యార్థుల గ్రామాల బాట కార్యక్రమం కొనసాగుతోంది. ప్రజల స్థితిగతులను అర్థం చేసుకుంటూ మంచి వైద్యుడిగా రాణించేందుకు కార్యక్రమం ఉపయోగపడుతుంది.

- వెంకట్ లకావత్,
ప్రిన్సిపాల్, జీఎంసీ, మానుకోట

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థిని సిరి

చిట్యాల: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థిని దైనంపల్లి సిరి తొమ్మిదో తరగతి చదువుతుంది. శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వేడుకల ఏర్పాట్లలో భాగంగా స్టీల్‌ పైపుతో కూడిన జెండాలను పట్టుకుని వెళ్తున్న క్రమంలో పాఠశాల ఆవరణలో విద్యుత్‌ తీగలకు తగిలింది. దీంతో విద్యార్థిని సిరి చేతికి, కాలుకు గాయాలు అయ్యాయి. గమనించిన పాఠశాల సిబ్బంది హుటాహుటిన స్థానిక సివిల్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించా రు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న బాలికను పరామర్శించారు.

ఉత్తములకు ప్రశంస


డిప్యూటీ స్పీకర్‌ రామచంద్రునాయక్‌, కలెక్టర్‌ లెనిన్‌ వత్సల్‌ టొప్పో, ఎస్పీ సుధీర్‌ రాంనాథ్‌ కేకన్‌ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్య్ర వేడుకల్లో ఉత్తమ అధికారులు, సిబ్బంది ప్రశంస పత్రాలు అందుకున్నారు. డిప్యూటీ స్పీకర్‌ రామచంద్రునాయక్‌, ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ లెనిన్‌ వత్సల్‌ టొప్పో, ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌ వారికి ప్రశంస పత్రాలు అందజేశారు.
- సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, మహబూబాబాద్‌


ప్రేమ్‌ కుమార్‌, డీసీఎస్‌ఓ | మరియన్న, డీహెచ్‌ఎస్‌ఓ | కిరణ్‌, డీపీఈజీ | శ్రీనివాసరావు, జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌


కృష్ణవేణి, మానుకోట ఆర్డీఓ | గణేష్‌, తొర్రూరు ఆర్డీఓ | రజిత, ఎంప్లాయిమెంట్‌ ఆఫీసర్‌ | రవి రాథోడ్‌, డీఎంహెచ్‌ఓ | రాజేంద్ర ప్రసాద్‌, డీపీఆర్‌ఓ | తిరుపతిరావు, మానుకోట డీఎస్పీ | దామోదర్‌, సూపరింటెండెంట్‌ కలెక్టరేట్‌ | హతీరాం, సీసీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ | ఉమ, ఎస్సై, దోర్నకల్‌ | తహెర్‌బాబా, సీసీఎస్‌ ఎస్సై | ఉపేందర్‌, ఎస్సై తొర్రూరు | రాజు, ఎస్సై, దంతాలపల్లి | ఉష, డబ్ల్యూపీసీ


రవి, పీసీ | రమేశ్‌, ఏఎస్సై | పాప్‌ లాల్‌, ట్రాఫిక్‌ పీసీ | సుధీర్‌, పీసీ | నవీన్‌, పీసీ | సుమన్‌, పీసీ | అరుణ, డబ్ల్యూ పీసీ | శ్రీరాములు, ఏఆర్‌ పీసీ | చిరంజీవి, ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ | రవి, అమ్మఒడి కెప్టెన్‌ | ఈశ్వరమ్మ, హెచ్‌డబ్ల్యూ ఆఫీసర్‌ | కల్పన, హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్‌ | ఆజాద్‌ చంద్రశేఖర్‌, డీఈఓ ఆఫీస్‌


రామ్మూర్తి, ప్రాజెక్టు మేనేజర్‌, డీపీఓ | విజయ్‌ కుమార్‌, మెడికల్‌ ఆఫీసర్‌ | మాధవి, నర్సింగ్‌ ఆఫీసర్‌ | భాగ్యశ్రీ, ఓఎస్‌, డీపీఆర్‌ఓ | సత్యనారాయణ, టీఎస్‌ఎస్‌ | రాంనర్సయ్య, టీఎస్‌ఎస్‌ | రవీందర్‌ గౌడ్‌, టీఎస్‌ఎస్‌ | వెంకన్న, టీఎస్‌ఎస్‌ | వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ ఏఓ | పార్థసారథి, ఏపీఓ | నాగరాజు, శాస్త్రవేత్త | నాగరాజు, హార్టికల్చర్‌ ఫీల్డ్‌ ఆఫీసర్‌


జగదీశ్వర్‌, ఆర్‌ఎంఓ, జీజీహెచ్‌ | నాగేశ్వరరావు, మానుకోట మున్సిపాలిటీ | రామయ్య, పోస్టుమ్యాన్‌ | క్రాంతి కుమార్‌, కేవీకే శాస్త్రవేత్త | నాగవాణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్‌ | రఘుపతి రెడ్డి, ఎంపీడీఓ | విజయ, డీఎంసీ | పురుషోత్తం, జెడ్పీ సీఈఓ | మధుసూదన్‌రాజు, డీఆర్‌డీఓ | శిరీష, డీడబ్ల్యూఓ | విజయనిర్మల, డీపీఓ

డెంగీతో బాలిక మృతి


శాన్విక (ఫైల్‌)

వేలేరు: డెంగీ జర్వంతో బాలిక మృతి చెందింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సూత్రపు రమేష్‌ కూతురు శాన్విక(7)కు ఐదు రోజుల క్రితం జర్వం రాగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్‌ దవాఖానాకు తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు డెంగీగా గుర్తించి చికిత్స చేస్తున్న క్రమంలో శుక్రవారం ఉదయం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దంత వైద్యశిబిరానికి స్పందన


టూత్‌పేస్ట్‌ అందజేస్తున్న డాక్టర్‌ గిరిధర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: భారత స్వాతంత్య్ర దినోత్సవం, ఎస్‌వీఎస్‌ దంత వైద్యశాల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ చౌరస్తాలోని దంత ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అనూహ్య స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్‌ గిరిధర్‌రెడ్డి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, టూత్‌పేస్టులు, మౌత్‌ వాష్‌లు అందజేశారు. దంతాల పరిరక్షణపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్యులు గణేష్‌, హారిక, సిబ్బంది యాకూబ్‌రెడ్డి, సౌమ్య, చంద్రిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వాజేడు: కనువిందు చేస్తున్న బొగత జలపాతం

బొగత కనువిందు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతం శుక్రవారం ఉధృతంగా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది. దండకారణ్యంలోని కర్రె గుట్టలపై గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో పైన ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జలపాతానికి భారీగా వరద వస్తోంది.

విద్యార్థి ఆత్మహత్య


సాయివర్ధన్‌ (ఫైల్‌)

బచ్చన్నపేట: తండ్రి మందలించాడని మనస్థాపంతో విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని లింగంపల్లిలో గురువారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, ఎస్సై అబ్దుల్‌ హమీద్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేడబోయిన నర్సమ్మ–మల్లయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. చిన్న కుమారుడు సాయివర్ధన్‌ (20) హైదరాబాద్‌లో హోటల్‌ మేనేజ్‌మెంట్‌ కోర్సు చదువుతున్నాడు. సాయివర్ధన్‌ సరిగా చదవడంలేదని తండ్రి మల్లయ్య మందలించాడు. దీంతో సాయివర్ధన్‌ క్షణికావేశంలో తమ బావి వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి


బన్నీ (ఫైల్‌)

పెద్దవంగర: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్‌ జిల్లా పెద్దవంగర మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన గద్దల బన్నీ (17) తన చిన్నతనంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో అమ్మమ్మ గ్రామమైన ఉప్పరగూడెంలో తాత కొమురయ్య సంరక్షణలో పెరిగాడు. పదో తరగతి పూర్తి కావడంతో ప్రస్తుతం నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల్లో ఇంటర్‌ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రాఖీ పౌర్ణమితోపాటు వరుస సెలవులు రావడంతో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. శుక్రవారం తాత పొలం పనులకు వెళ్లాడు. అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై క్రాంతికిరణ్‌ను వివరణ కోరగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించామని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడతామని తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదన్నారు.


పాకాల సరస్సు మత్తడి వద్ద స్థానికుల సందడి..

పాకాల మత్తడి పరవళ్లు


సరస్సు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దొంతి

ఖానాపురం:వరంగల్‌ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు మత్తడి పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో సరస్సులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు. శుక్రవారం మత్తడి పోయడంతో ప్రజలు మత్తడి వద్ద సందడి చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మత్తడిని సందర్శించి పూజలు చేశారు.

సంఘాలను మరింత పటిష్టం చేయాలి

- టెస్కాబ్‌ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు


సీఎం రేవంత్‌ రెడ్డి, మంత్రి తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రవీందర్‌ రావు, డైరెక్టర్లు

హన్మకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలని తెలంగాణ స్టేట్‌ కో ఆపరేటివ్‌ అపెక్స్‌ బ్యాంక్‌, వరంగల్‌ డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీసీబీలు, టెస్కాబ్‌ పాలకవర్గాలకు ప్రభుత్వం ఆరు నెలలు పొడిగింపు ఇచ్చిన సందర్భంగా శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్‌ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సీఎం రేవంత్‌ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌ రావు చిత్రపటాలకు పాలక వర్గంతో కలిసి రవీందర్‌ రావు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సేవ చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. వరంగల్‌ డీసీసీబీని ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామన్నారు. వ్యవసాయ రంగానికి సేవలు విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్‌ డైరెక్టర్లు హరిప్రసాద్‌, మాడుగుల రమేష్‌, దొంగల రమేష్‌, ఎర్రబెల్లి గోపాలరావు, మురళి, సంపెల్లి నరసింగరావు, నరేందర్‌ రెడ్డి, పోలపాక శ్రీనివాస్‌, సొసైటీ చైర్మన్లు రాజేష్‌ ఖన్నా, రామచంద్ర రావు, లక్ష్మారెడ్డి, దేవేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్‌ గౌడ్‌, డీసీసీబీ సీఈఓ వజీర్‌ సుల్తాన్‌ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికాభివృద్ధిలో కొత్త ఒరవడి

- టీజీ ఎన్పీడీసీఎల్‌ ప్రాజెక్టు డైరెక్టర్‌ మోహన్‌రావు



మాట్లాడుతున్న వంగూరు మోహన్‌ రావు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌ రెడ్డి సాంకేతికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రాజెక్టు డైరెక్టర్‌ వంగూరు మోహన్‌రావు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయంలో మోహన్‌రావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏపీటీఎస్‌–విజిలెన్స్‌ వారిచే గౌరవ వందనం స్వీకరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్‌ ఉద్యోగ అమరులకు కార్యాలయం ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఎన్పీడీసీఎల్‌ పరిధిలో 18 జిల్లాల్లో 70 లక్షల మంది వినియోగదారులకు 24/7 మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2024 సంవత్సరం (ఏప్రిల్‌ నుంచి జూలై) తో పోల్చుకుంటే 33 కేవీ బ్రేక్‌ డౌన్స్‌ 2025 (ఏప్రిల్‌ నుంచి జూలై) లో 21శాతం, 11 కేవీ బ్రేక్‌ డౌన్లు 46శాతం తగ్గాయన్నారు. విద్యుత్‌ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సీఎండీ వరుణ్‌ రెడ్డి స్వీయ ఆలోచనతో రూ. కోటి బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. పునరుత్పాదక శక్తి జూన్‌ 30, 2025 నాటికి ఎన్పీడీసీఎల్‌లో 2155.87 మెగావాట్ల సోలార్‌ ఎనర్జీ జనరేషన్‌ సామర్థ్యాన్ని సాధించామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వంటేరు తిరుపతి రెడ్డి, మధుసూదన్‌, చీఫ్‌ ఇంజనీర్లు అశోక్‌ కుమార్‌, తిరుమల్‌రావు, రాజుచౌహాన్‌, అశోక్‌, వెంకటరమణ, మాధవరావు, సీజీఎంలు చరణ్‌ దాస్‌, రవీంద్రనాథ్‌, జాయింట్‌ సెక్రటరి రమేష్‌, కంపెనీ కార్యదర్శి వెంకటేశం, వరంగల్‌ ఏపీటీఎస్‌ సీఐ కిరణ్‌ పాల్గొన్నారు.

నలుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్‌

- 25 కిలోల 800 గ్రాముల గంజాయి, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నరసింహారావు


నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ నరసింహారావు

వరంగల్‌ క్రైం: హనుమకొండ పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కొటిక్స్‌ డ్రగ్స్‌ కంట్రోల్‌ టీం ఆధ్వర్యంలో నలుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్‌ చేశారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నరసింహారావు వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం హనుమకొండ కుమార్‌పల్లిలోని సెయింట్‌ జోసెఫ్‌ స్కూల్‌ దగ్గర నలుగురు వ్యక్తులు ఎండు గంజాయి కలిగి ఉన్నారని వచ్చిన సమాచారంతో నార్కొటిక్స్‌ సీఐ శ్రీకాంత్‌, ఎస్సై సీహెచ్‌ పరుశురాములు, సిబ్బందితో కలిసి వెళ్లి కారులో గంజాయిని తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ఎండీ ఫైజాన్‌, ఎస్‌డీ అన్సార్‌, ఎండీ అర్బాన్‌, కుమార్‌పల్లికి చెందిన అర్షద్‌ అలీఖాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి 25కిలోల 800గ్రాముల ఎండు గంజాయితోపాటు ఐదు సెల్‌ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఫైజాన్‌, అన్సార్‌, అర్బాన్‌.. ఆంధ్రప్రదేశ్‌– ఒడిశా బార్డర్‌ వద్ద బాలు అనే వ్యక్తి నుంచి గంజాయిని తీసుకొచ్చి హనుమకొండలోని కుమార్‌పల్లో చెందిన అర్షద్‌ అలీఖాన్‌ ఇంట్లో డంప్‌చేసి, అవసరమైన వాళ్లకి విక్రయిస్తుంటారు. ఈక్రమంలో గంజాయిని కారులో తీసుకొస్తూ పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. నిందితులను హనుమకొండ పోలీసులకు అప్పగించగా ఇన్‌స్పెక్టర్‌ మచ్చ శివకుమార్‌ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యాంటీ నార్కొటిక్‌ డ్రగ్స్‌ కంట్రోల్‌ టీం, హనుమకొండ పోలీస్‌స్టేషన్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.